

# మహాభారతం

## 9

## నియోగవిధి-దేవరన్యాయం ధర్మసూక్ష్మాలు


రచన:

మహాభారత పరిశోధకులు

'జ్ఞానప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc., (Ag)

వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట.

ఫోన్ : 08647 254716.


(గత సంచిక తరువాయి)

### సత్యవతి కురువంశాభివృద్ధికి వ్యాసుని నియోగించుట

సత్యవతి ద్వారా వ్యాసుని మాట వినగానే భీష్ముడు రెండు చేతులు జోడించి, "అమ్మా! వ్యాసుడు మహాత్ముడు, ధర్మజ్ఞుడు, మహాజ్ఞాని, మహాతపస్వి, దైవాంశ సంభూతుడు. ఆయనవల్ల మన వంశం నిలుస్తుందనే నమ్మకం నాకు పూర్తిగా ఉంది." అన్నాడు భీష్ముడు. భీష్ముడు తన అంగీకారాన్ని తెలుపగానే సత్యవతి మనస్సులో వ్యాసుని స్మరించింది. మరుక్షణమే వేదమంత్రాలను వల్లెవేసుకుంటూ ప్రత్యక్షమయ్యాడు వ్యాసుడు. బిడ్డ పుట్టినప్పుడు చూచింది, మళ్ళీ ఇంతకాలానికి చూస్తున్నది. ఆమె నేత్రాలనుండి ఆనంద భాష్పాలు రాలుతున్నాయి.

వ్యాసుడు తల్లికి నమస్కరించాడు. "అమ్మా! నీవు నన్ను ఎందుకు స్మరించావో ఆ కారణం తెలియజెయ్యి. నీ కోరిక ఏమిటో తెలియజేస్తే దానిని నేను నెరవేరుస్తాను" అన్నాడు. దానికి సత్యవతి, "నాయనా! నీవు నా ప్రథమ పుత్రుడవు. విచిత్ర వీర్యుడు నా కనిష్ట పుత్రుడు. విచిత్రవీర్యుడు సంతాన హీనుడుగా మరణించాడు. ఈ భీష్ముడు అకుంఠిత బ్రహ్మచర్య వ్రతదీక్షా సంపన్నుడు. ఈ కురువంశం ఇంతటితో అంతరించి పోకుండా ఉండాలంటే, పుత్రులకొరకు పరితపిస్తున్న విచిత్ర వీర్యుని ఇద్దరు భార్యలయందు నీవు సంతానాన్ని ప్రసాదించాలి" అన్నది సత్యవతి.

"అమ్మా! ధర్మసమ్మతమైన నీ మాట ప్రకారం నీ ఆజ్ఞను పాలిస్తాను. ఇది శాస్త్రంలో ఉన్న సనాతన ధర్మమే. నీ కోడండ్రిద్దరిని ఒక సంవత్సరం వ్రతం చెయ్యమను. "వ్రతం చెయ్యకుండా ఏ స్త్రీ కూడా నా సమీపానికి రాలేదు" అన్నాడు వ్యాసుడు.

దానికి సత్యవతి వ్యాసునితో, "నాయనా! శీఘ్రమే గర్భధారణ జరిగేటట్లు చూడు. హస్తినాపురం ఇప్పుడు రాజులేని రాజ్యం. తండ్రిని పోగొట్టుకున్న బిడ్డలలాగా ఉంది ప్రజల పరిస్థితి. రాజులేని రాజ్యం అధర్మాలకు, అరాచకానికి నిలయమౌతుంది. అటువంటి రాజ్యాన్ని దేవతలు త్యజిస్తారు. దేవతల అనుగ్రహానికి దూరమైతే అనావృష్టి కరువు కాటకాలు సంభవిస్తాయి. కనుక నీవు శీఘ్రమే పుత్రోత్పాదన చెయ్యాలి" అన్నది సత్యవతి.

"అయితే వారు నా రూపం చూచి భయపడకుండా శాంతంగా ఉండగలగాలి. నా రూప, వేష, గంధాలను సహించ గలిగితే అంబిక ఈ రోజే గర్భవతి అవుతుంది" అని చెప్పి వ్యాసుడు అంతర్ధానమయ్యాడు.

ఆ తరువాత సత్యవతి ఏకాంతంలో కోడలు అంబికతో "అమ్మా! నేను నీతో ధర్మసంగతమైన విషయాలను చెప్పబోతున్నాను. వాటిని శ్రద్ధగా విను. నా పుత్రుని మరణంతో భరత వంశం విచ్ఛిన్నమై పోయే స్థితి ప్రాప్తించింది. ఈ కారణం చేత నా వ్యథను, పితృవంశ విచ్ఛేదనాన్ని అర్థం చేసుకున్న భీష్ముడు, ఈ కురువంశ వృద్ధికై తన అంగీకారాన్ని తెలియజేశాడు. ఇప్పుడు ఈ వంశవృద్ధికై భీష్ముడు తెలిపిన తన సమ్మతి యొక్క సార్థకత నీపై ఆధారపడి ఉన్నది. నేను నా అభీష్టాన్ని సిద్ధింపజేసుకొనేందుకు నీవు భీష్ముడు చెప్పిన దానికి అనుగుణంగా నడుచుకో. విచ్ఛిన్నమైపోతున్న ఈ భరతవంశాన్ని నిలబెట్టు. నీవు దేవేంద్రునితో సమానమైన ఒక తేజస్వంతుడైన

పుత్రునికి జన్మనివ్వు. అతడే మన కురువంశ రాజ్యభారాన్ని వహిస్తాడు" అన్నది.

అంబిక ధర్మాచరణము నందు ఆసక్తి గలిగినది. సత్యవతి ధర్మమునననుసరించియే అంబికకు నచ్చజెప్పి, ఈ కార్యానికి ఆమెను సిద్ధం చేసినది. ఆ తరువాత బ్రాహ్మణులకు, దేవర్షులకు, అతిధులకు భోజనములు పెట్టి సంతృప్తి పరచారు. (ఆదిపర్వం 104వ అధ్యాయం)

ఆ తరువాత సత్యవతి ఋతుస్నాతయైన తన కోడలిని శయ్యపై కూర్చుండబెట్టి ఇలా అన్నది, "నీకొక దేవరుడున్నాడు (దేవరుడు అంటే భర్త సోదరుడు బావ) అతడే ఈ రోజు గర్భాదానం చేయుటకు వస్తాడు. నీవు ప్రశాంతంగా ఉండి అతడి కొరకు నిరీక్షించు. అతడు సరిగ్గా అర్ధరాత్రి సమయంలో వస్తాడు" అన్నది.

**శ్లో॥ శ్వశ్వాస్తద్ వచనంశ్రుత్వా శయానా శయనే శుభే ।**
**సోచంతయత్ తదాభీష్మం అన్యాంశ్చ కురుపుంగవాన్॥**
**(105-3)**

తా॥ అత్తగారి ఈ మాటలు విని అంబిక పవిత్ర శయ్యపై శయనించి, ఆ సమయంలో **మనస్సులో భీష్ముని, ఇతర కురు వంశీయులను తలచుకుంటూ ఉన్నది.** ఆ సమయంలో వ్యాస మహర్షి తల్లియానతిపై నియోగవిధిననుసరించి, అంబిక యొక్క భవనంలో ప్రత్యక్షమయ్యాడు. శరీరం నిండా నెయ్యిపూసుకొని, మనోనిగ్రహంతో, విరూపంతో, నల్లని శరీరచ్ఛాయతో పింగళ వర్ణ జటలు ధరించి ఉన్నాడు. అతడి కళ్ళు మిణుగురులు లాగా ప్రకాశిస్తూఉన్నాయి. అతడిని చూడగానే అంబిక తన రెండు కళ్ళను మూసుకొన్నది. తల్లి నియోగంతో వ్యాసుడు అంబికతో సంగమించాడు. కాని అంబిక మాత్రం భయంతో కన్నులు మూసుకొని ఆయనవైపుకు చూడనేలేదు.

అంబిక శయ్యాగారం నుండి వ్యాసుడు బయటకు రాగానే సత్యవతి వ్యాసునితో, "కుమారా! అంబిక గర్భం నుండి గుణవంతుడైన రాజకుమారుడు జన్మిస్తాడా?" అని అడిగింది. దానికి వ్యాసుడు "తల్లీ! పదివేల ఏనుగుల బలం కలిగిన వాడు, విద్వాంసుడు, రాజర్షులలో శ్రేష్ఠుడు, సౌభాగ్యశాలి, పరాక్రమ శాలి అయిన పుత్రుడు పుడతాడు. కాని మాతృదోషం చేత అతడు పుట్టుకతోనే అంధుడుగా జన్మిస్తాడు" అన్నాడు వ్యాసుడు.

అపుడు సత్యవతి,

**శ్లో॥ నాంధః కురూణాం నృపతి రనురూపస్తపోధన।**
**జ్ఞాతి వంశస్య గోప్తారం పిత్రూణాం వంశవర్ధనం॥**
**(105-11)**
**ద్వితీయం కురువంశస్య రాజానందాతుమర్హసి ।**
**సతథేతి ప్రతిజ్ఞాయ నిశ్చక్రామ మహాయశాః (105-12)**

తా॥ నాయనా! కురువంశపు రాజు అంధుడు కాదగడు గదా! అందువల్ల రాజై, జ్ఞాతులను, సమస్త కులాన్ని రక్షించేవాడు, తండ్రి వంశాన్ని వృద్ధి చేసేవాడు కాగల మరియొక పుత్రుని ఈ కురువంశం కోసం ప్రసాదించు అనగా 'అలాగే' అని చెప్పి మహాయశస్వి వ్యాస భగవానుడు అక్కడినుండి వెళ్ళిపోయాడు.

నవమాసాలు నిండిన తరువాత అంబిక అంధుడైన పుత్రుని ప్రసవించింది. అంతట సత్యవతి తన రెండవ కోడలు అంబాలికను అంగీకరింపజేసి, శయ్యా మందిరంలో కూర్చోబెట్టి, వ్యాసుని స్మరించింది. వ్యాసుడరుదెంచి, నియోగవిధి ననుసరించి అంబాలికతో సంగమించాడు. అంబాలిక వ్యాసుని చూచి తెల్లబోయింది. సమాగమ సమయంలో పాలిపోయిన ముఖంతో ఉన్నది. అప్పుడు వ్యాసుడు అంబాలికతో, "నన్ను చూచి వివర్ణురాలివయ్యావు కనుక నీకు పుట్టబోయే బిడ్డ సకల సుగుణసంపన్నుడు, మహాపరాక్రమవంతుడయ్యూ పాండువర్ణ దేహంతో ఉంటాడు. అందరూ అతణ్ణి 'పాండు' అనే పిలుస్తారు" అని వెలుపలికి రాగా సత్యవతి సాభిప్రాయంతో చూచింది. వ్యాసుడు అంబాలికకు చెప్పిన మాటనే చెప్పాడు.

అంత సత్యవతి, "తండ్రీ! నేను పిలిచినపుడు వచ్చి మరొక పుత్రుని ప్రసాదించమని"కోరింది. అంగీకరించి వెళ్ళిపోయాడు వ్యాసుడు.

ఆ తరువాత నెలలు నిండగానే అంబాలిక పాండువర్ణ దేహంతో ఉన్న అందమైన పుత్రుని కన్నది.

తరువాత కొంతకాలానికి సత్యవతి అంబికను మరొక పుత్రుని కొరకు సిద్ధం చేసి, వ్యాసుని ఆహ్వానించింది. అంబిక తన దాసిని సిద్ధంచేసి శయ్యామందిరానికి పంపింది. ఆ దాసి వ్యాసుని ఎంతో భక్తితో సేవించింది. వ్యాసుడు ఆమెకు గర్భాదానం చేసి ఆమెతో, "ఇక నీవు దాసివి కాదు. నీ గర్భంలో అత్యంత శ్రేష్టుడైన బాలుని నిక్షిప్తం చేశాను. లోకంలోని ధర్మాత్ములు, కృతజ్ఞులు, సత్యజ్ఞులు, బుద్ధిమంతులందరిలోకి శ్రేష్ఠుడవుతాడు" అని చెప్పాడు వ్యాసుడు. తిరిగి వెళుతూ సత్యవతితో, "అమ్మా! అంబిక నా వద్దకు తన దాసిని పంపింది. నేను ఆమెకే పుత్రదానం చేశాను" అని చెప్పి వ్యాసుడు అంతర్ధాన మయ్యాడు.

వ్యాసుని అనుగ్రహంతో దాసి మగశిశువును ప్రసవించింది. అతడే విదురుడు. ధర్మాత్ముడు, రాగద్వేషాలకు అతీతుడు, కామక్రోధరహితుడు, అర్థశాస్త్రంలో నిష్ణాతుడు. సాక్షాత్తు

యమధర్మరాజే భూలోకంలో విదురుడుగా జన్మించాడు. (ఆదిపర్వం 105వ అధ్యాయం).

ఇదీ ధృతరాష్ట్ర, పాండురాజ, విదురుల జన్మవృత్తాంతం. ఈ గాథను తెలుసుకొన్న తర్వాత ఈనాటి మానవులకెవరికైనా మనస్సు చిత్తక్షుమనక మానదు. భర్త మరణానంతరం భార్య మరొక పురుషుని ద్వారా సంతానాన్ని కనటం పాతివ్రత్యధర్మానికి విరుద్ధంగాను, అనాచారంగాను, అపవిత్రంగాను, అసహ్యకరం గాను అనిపిస్తుంది. ఇక్కడ సంతానాన్ని పొందినది విచిత్రవీర్యుని భార్యలు అంబిక, అంబాలికలు. సంతానాన్ని ప్రసాదించినది వేదవ్యాసుడు. నియోగించినది విచిత్రవీర్యుని తల్లి సత్యవతి. అంగీకారం తెలిపినది భీష్ముడు. ఇందరిమధ్య జరిగిన ఈ కార్యంలోని ధర్మాధర్మములెట్టివి?

## సందేహాలు-సమాధానాలు

**1.** ఇలాంటి అసహ్యకరమైన పద్ధతిలో సంతానాన్ని పొందవలసిన అవసరమేమిటి?

**స॥** పుత్రసంతానం లేకుండా మహారాజు మరణించినపుడు, ఆ రాజ్యం అరాచకం కాకుండా ఉండేందుకు, ఆ వంశం నిరంతరాయంగా కొనసాగేందుకు, ఆపద్ధర్మంగా అంటే ఆపద తటస్థించినపుడు అనుసరించవలసిన ధర్మంగా, కలియుగానికి ముందు కాలంలో అంటే ద్వాపరయుగంలో ఈ 'నియోగవిధి'ని అనుసరించేవారు. 'నియోగవిధి' అంటే సంతానాన్ని పొందవలసిన స్త్రీని పెద్దలు, గురుజనులు నియోగించుట. ఇది ఈ కాలంలో ఆచరణలో లేదు గనుక, అసహ్యకరమైనది, అపవిత్రమైనది, అధర్మమైనది అని భావించటం జరుగుతున్నది. కాని ఆ కాలంలోని సమాజం అలా భావించలేదు. అందుకే ధృతరాష్ట్ర, పాండురాజ, విదురులను ఎవరూ వేలెత్తి చూపలేదు. పైగా ఎంతగానో గౌరవించారు.

**2.** ఇది ధర్మసమ్మతమైనదేనని ఎలా భావించగలం?

**స॥** సత్యవతి భీష్ముని పిలిచి "నాయనా! నీ సోదరుని భార్యల యందు నీవు సంతానాన్ని ప్రసాదించు" అన్నపుడు, "తల్లీ! నీవు చెప్పినదంతా ధర్మయుక్తమే. అందులో ఏమాత్రం సందేహం లేదు" అన్నాడు భీష్ముడు. కాని తన ప్రతిజ్ఞకారణంగా తన అశక్తతను తెలియజేశాడు. అంతేకాదు 'ధర్మహాని కలుగకుండా శంతనుని వంశపరంపర కొనసాగే ఉపాయాన్ని చెబుతాను. అది ధర్మయుతమైనది, సనాతన క్షత్రియధర్మం కూడా. ఆపద్ధర్మ నిర్ణయాలలో నిపుణులైన విద్వాంసుల ద్వారా విన్నటువంటిది, లోకాచార వ్యవహారాలకు అనుగుణమైనటు వంటిదీ' అని ఆ ఉపాయాన్ని తెలియజేశాడు. అదే గుణవంతు డైన బ్రాహ్మణునకు ధనమిచ్చి నియోగించిన అతడు విచిత్ర వీర్యక్షేత్రములందు సంతానాన్ని ప్రసాదించగలడు అనే ఉపాయం. దీనిని బట్టి భీష్ముని దృష్టిలో ఈ నియోగవిధి అనేది ధర్మయుక్తమైనది, సనాతన క్షత్రియధర్మం, విద్వాంసులచే చెప్పబడినది, లోకాచార వ్యవహారాలకు అనుగుణమైనది- అని స్పష్టం.

ఈ మాటలకు సత్యవతి ఏమన్నది? **"నాయనా! నీవు చెప్పినది ధర్మసమ్మతమే, ఆచారంలో ఉన్నదే, ఇపుడు మనం ఆచరించదగినదే"** అని. అంటే సత్యవతి దృష్టిలో కూడా ధర్మ సమ్మతమైనది, ఆచారంలో ఉన్నది, ఆచరించదగినది అని స్పష్టం.

ఇక వ్యాసుడు వచ్చిన తరువాత, సత్యవతి కోరిన మీదట వ్యాసుడేమన్నాడు? అమ్మా! **ఇది శాస్త్రంలో ఉన్న సనాతన ధర్మమే** అన్నాడు. (సనాతన ధర్మం అంటే ఎప్పటినుండో ఆచరణలో ఉన్న ధర్మమే అని) అంటే వ్యాసుని దృష్టిలో కూడా ఇది సనాతన ధర్మమేనని స్పష్టం. అంతేగాదు ఇది శాస్త్రాలలో కూడా ఉన్నదేనని అన్నాడు. కనుక ఈ నియోగవిధి ధర్మసమ్మతమైనది, శాస్త్రాలలో ఉన్నది, ఆచరణలో ఉన్నది అని సత్యవతి, భీష్మ, వేదవ్యాసుల వచనాలను బట్టి ఋజువౌతున్నది.

**3.** వారి మాటలను బట్టి ధర్మసమ్మతమైనదని నిర్ణయించటమేనా? లేక ఆచరణలో ఉన్నట్టు ఏవైనా ఋజువులున్నాయా? ఈ విధానం ద్వాపరయుగంలోనేనా? లేక త్రేతాయుగంలో కూడా ఉన్నదా? రామాయణ కాలంలో ఉన్న పవిత్రత మహాభారత కాలం నాటికి లేకుండా పోయిందని వాపోయే విమర్శకులకు ఏమిటి సమాధానం?

**స॥** రామాయణకాలం అంటే త్రేతాయుగంలో కూడా ఈ విధానం ఆచరణలో ఉన్నదని మహాభారతం ఆదిపర్వం 64వ అధ్యాయంలో, జనమేజయుని ప్రశ్నకు వైశంపాయన మహర్షి ఇలా తెలియజేస్తున్నాడు.

**శ్లో॥ త్రిః సప్తకృత్వః పృథివీం కృత్వా నిఃక్షత్రియాంపురా।**
**జామదగ్న్యస్త పస్తేపే మహేంద్రేపర్వతోత్తమే॥ (4)**
**శ్లో॥ తథా నిఃక్షత్రియే లోకే భార్గవేణ కృతేసతి।**
**బ్రాహ్మణాన్ క్షత్రియారాజన్ సుతార్థిన్యోఽభి చక్రముః॥ (5)**

తా॥ పూర్వకాలంలో జమదగ్ని పుత్రుడు పరశురాముడు

మేధావులు ఏకత్వంలో భిన్నత్వాన్ని చూస్తారు, కాని గుణవంతులు భిన్నత్వంలో ఏకత్వాన్ని చూస్తారు.

21మార్లు క్షత్రియసంహారం చేసి ఈ భూమండలాన్ని క్షత్రియ శూన్యం చేసి మహేంద్రగిరిపై తపస్సు చేసుకున్నాడు. ఈ లోకాన్ని క్షత్రియ శూన్యం చేసిన ఆ సమయంలో క్షత్రియ కాంతలు పుత్రసంతాన కాంక్షతో బ్రాహ్మణుల (పురోహితుల) శరణుజొచ్చారు.

**శ్లో॥ తాభిః సహసమోపేతుః బ్రాహ్మణాః సంశితవ్రతాః॥**
**ఋతావృతౌ నరవ్యాఘ్ర నకామాన్నానృతౌ తథా॥ (6)**

తా॥ ఆ కఠోర వ్రతధారులైన బ్రాహ్మణులు కేవలం ఋతు కాలంలో మాత్రమే ఆ క్షత్రియ కాంతలతో సమాగమం జరిపేవారు. వారు ఋతుకాలంలో మాత్రమే గాక, కామవాంఛ లేని వారై మాత్రమే వారితో కలిసేవారు.

ఆ విధంగా భర్తలను కోల్పోయిన ఆ రాణులు బ్రాహ్మణుల ద్వారా గర్భధారణ చేసి బలశాలురైన క్షత్రియ కుమారులకు జన్మనిచ్చారు. ఇలా తపస్సంపన్నులైన బ్రాహ్మణుల ద్వారా క్షత్రియకాంతల గర్భం నుండి ధర్మపూర్వకమైన క్షత్రియ సంతానం ఉత్పన్నమైంది, వృద్ధిచెందినది. ఆ సంతానం దీర్ఘాయుష్మలై యున్నారు. (7,8,9 శ్లోకాల భావం)

దీనినిబట్టి రామాయణ కాలంలో కూడా ఈ నియోగవిధిని అనుసరించి సంతానాన్ని పొందటం ఉన్నదని, అదే భారత కాలంలో కూడా ఉన్నదని స్పష్టమవుతున్నది. మహాభారత కాలం అపవిత్రమని, రామాయణకాలం పవిత్రమని భావించటం కేవలం అపోహ మాత్రమే. కనుక ఇది ఆచరణలో ఉన్న ధర్మమే. సనాతనమైన ధర్మమే.

**4.** సరే, రామాయణకాలం నుండీ ఆచరణలో ఉన్నదేనని, ఇది సనాతన ధర్మమేనని అంగీకరిద్దాం. మరి శాస్త్రాలలో కూడా ఉన్నదేనని వ్యాసుడన్నాడు గదా! మరి ఏ ధర్మశాస్త్రాలలో ఈ విధానం గురించి ఉన్నది? ఆ శాస్త్రాలలో ఏమని చెప్పారు?

**స॥** "మనుధర్మశాస్త్రం" మొదటి అధ్యాయం 62, 63 శ్లోకాలు ఈ విధి విధానం గురించి ఏం చెబుతున్నాయో చూద్దాం.

**శ్లో॥ విధవాయాం నియుక్తస్తు ఘృతాక్తో వాగ్యతోనిశి।**
**ఏకముత్పాదయేత్ పుత్రం నద్వితీయం కథంచన॥**
(మను 1 అధ్యా. 62శ్లో)

**తా॥** వైధవ్యమును పొందిన స్త్రీకి గురుజనుల ద్వారా నియుక్తుడైన పురుషుడు తన శరీరము నందంతటను నెయ్యి రాసుకొని, ఏమీ మాట్లాడకుండా, నిశిరాత్రి వేళ కలుసుకోవాలి. ఒక్క పుత్రునికి మాత్రమే జన్మనివ్వాలి. రెండవ వాని కొరకు ప్రయత్నించరాదు.

**శ్లో॥ విధవాయాం నియోగాయే నివృత్తేతు యథావిధి।**
**గురువచ్చ స్నుషావచ్చ వర్తేయాతాం పరస్పరం॥** (మను 1 అధ్యా. 63శ్లో)

**తా॥** భర్తృ హీనయైన స్త్రీతో నియోగవిధిని అనుసరించి (అంటే కామపరవశులు కాకుండా, కర్తవ్య నిర్వహణ బుద్ధితో, ఇంద్రియాలను అనాసక్తితో ఉంచి, మనస్సును స్వాధీనంలో పెట్టుకొని) నియోగ ప్రయోజనం సిద్ధించిన తర్వాత (గర్భాదానం తర్వాత) ఆ స్త్రీ పురుషుణ్ణి తండ్రిలాగాను, పురుషుడు ఆ స్త్రీని తన కోడలిగాను భావించి పరస్పరం ప్రవర్తించాలి.

నియోగవిధిని గురించి మనుధర్మశాస్త్రం చెప్పిన శ్లోకాల నుండి మనం గ్రహించవలసిన ముఖ్య విషయాలేమిటో చూద్దాం. ఈ నియోగవిధి ఎంత కఠినతర నియమాలతో ఆచరించేవారో తెలుసుకుందాం.

(i) స్త్రీలు తమంతట తాముగా సంతానాన్ని పొందరాదు. పెద్దలు, గురుజనుల యొక్క అనుమతితో, వారియొక్క నియోగంతో మాత్రమే జరుగవలసిన కార్యం ఇది.

(ii) పురుషుణ్ణి నిర్ణయించటంలో కూడా పెద్దల ఇష్టమే గాని, ఆ స్త్రీ యొక్క ఇష్టాయిష్టాలేమీ ఉండవు.

(iii) నియోగవిధిని పాటించవలసిన పురుషుడు శరీరము నందంతటా నెయ్యి పూసుకోవాలి. దానివల్ల శరీరరూప సౌందర్యం మరుగున పడుతుంది. కామాన్ని ప్రేరేపించే చర్యలుండవు.

(iv) సంయోగ సమయంలో మాట్లాడరాదు. మాటలవల్ల పరిచయాలు, సంబంధం కొనసాగించాలనే నిర్ణయాలు జరుగవచ్చు. కనుక మౌనంగా ఉండాలి.

(v) నియోగం ఒక్క పుత్రుని కొరకే. వారంతట వారే మరొక పుత్రుని కొరకు ప్రయత్నించరాదు.

(vi) ఒక్కసారి కలయికతోనే గర్భాదానం చేయగల తపశ్శక్తి సంపన్నుడైన మహాత్ముణ్ణే నియోగించాలి.

(vii) స్త్రీ పురుషులిరువురూ కామపరవశులు కాకుండా, కర్తవ్యమునందే బుద్ధిని నిలిపియుంచాలి.

(viii) సంయోగ సమయంలో మనస్సు చలించకుండా మనోనిగ్రహం ఉండాలి. ఇంద్రియాలు అనాసక్తంగా ఇంద్రియ నిగ్రహంతో ఉండాలి.


(ix) సంయోగానంతరం ఎప్పుడైనా ఆ స్త్రీ పురుషులు ఎదురుపడితే స్త్రీ ఆ పురుషుని తండ్రిలాగా, పురుషుడు ఆ స్త్రీని కోడలిగా చూడగల మనోనిగ్రహం, పవిత్రత వారిలో ఉండాలి. ఇలా కత్తిమీద సాములాంటిది ఈ నియోగవిధి. సామాన్యులకు అసాధ్యమైనది.

5. మరి ఈ కలియుగంలో ఈ నియోగవిధి ఎందుకు ఆచరణంలో లేదు? **(వచ్చే సంచికలో)**

# మహాభారతం

## నియోగవిధి-దేవరన్యాయము తెలుసుకోవలసిన విషయాలు **10**

రచన
మహాభారత పరిశోధకులు,
'జ్ఞానప్రపూర్ణ' శ్రీదేవిశెట్టి చలపతిరావు B.Sc.(Ag.)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట.
ఫోన్:08647-254716



(గతసంచిక తరువాయి)

### సత్యవతి కురువంశాభివృద్ధికి వ్యాసుని నియోగించుట

సంతాన హీనుడుగా మరణించిన హస్తినాపురాధీశ్వరుడు విచిత్రవీర్యుని భార్యలు అంబిక, అంబాలికలు నియోగవిధిని అనుసరించి, సత్యవతీ నియోగంతో, భీష్ముని అంగీకారంతో, వేదవ్యాసమహర్షి ద్వారా సంతానాన్ని పొందిన విషయాన్ని, ఆ నియోగవిధి ఆపద్ధర్మంగా రామాయణకాలంలో కూడా ఆచరణలో ఉన్నదేనని; పైగా ధర్మశాస్త్రాలలో కూడా చెప్పబడిన సనాతన క్షత్రియ ధర్మమేనని, సత్యవతి, భీష్ముడు, వేదవ్యాసుడు- ఈ ముగ్గురి దృష్టిలో ధర్మసమ్మతమైనది, ఆచరణీయమైనది, సనాతనమైనది, విద్వాంసులద్వారా విన్నటువంటిది, శాస్త్రంలో చెప్పబడినది, పురాతనకాలం నుండి ఆచరణలో ఉన్నది-అని గతసంచికలో నిరూపించటం జరిగింది. అంతేగాక మనుధర్మశాస్త్రంలో ఈ నియోగవిధిని గూర్చి ఏమి చెప్పబడిందో, ఎటువంటి కఠినమైన, సామాన్యులకు అసాధ్యమైన నియమనిబంధనలు విధించబడినవో కూడా చెప్పటం జరిగింది.

అయితే శాస్త్రాలలో చెప్పబడినట్టిదీ, రామాయణకాలం నుండి ఆచరణలో ఉన్నది, ధర్మసమ్మతతమైనదని మహాత్ములచే చెప్పబడినది అయిన ఈ 'నియోగవిధి'- ఈ కాలంలో అంటే కలియుగంలో ఎందుకు ఆచరణలో లేదు? అనే సందేహం కలుగవచ్చు. దానికి సమాధానం ఇక్కడ తెలియజేయబడుచున్నది.

**5**. మరి ఈ కలియుగంలో ఈ నియోగవిధి ఎందుకు ఆచరణలో లేదు?

సమాధానం: ఈ నియోగవిధి ఎంతటి కఠిన నియమ నిబంధనలతో కూడుకొని ఉన్నదో, మనుధర్మశాస్త్రంలోని రెండు శ్లోకాలనుండి ఇంతకుముందే తెలియజేయటం జరిగింది. నియోగవిధిని పాటించే పురుషుడు తపశ్శక్తి సంపన్నుడైన మహాత్ముడై ఉండాలి. అతడికి ఇంద్రియనిగ్రహము, మనోనిగ్రహము ఉండాలి. కామపరవశుడు కాకుండా ఉండాలి. సంయోగ సమయంలో శరీరం నిండా నెయ్యిపూసుకొని, ఏమి మాట్లాడకుండా ఉండాలి. అలాగే సంయోగానంతరం ఆ స్త్రీ ఎదురుపడితే ఆమెను కోడలిగా పవిత్రభావంతో చూడాలి. ఇట్టి మహాత్ములు ఈ కలియుగంలో దుర్లభం. ఇంద్రియ మనోనిగ్రహాలు లేనివారిని నియోగించరాదు కనుక ఇది ఈ కాలంలో సాధ్యంకాదు, ఆచరణలో లేదు.

ఇక ఆ స్త్రీ కూడా కామానికి వశురాలై ప్రవర్తించరాదు. సంయోగానంతరం ఆ పురుషుని తండ్రిగా భావించాలి. ఇది కూడా ఈ కాలంలో అసాధ్యం.

అయితే ఇప్పటి మానవులు మనోనిగ్రహంలేని వారు, కామానికివశులై ప్రవర్తించేవారు, తపశ్శక్తి సంపన్నతలేనివారు కావచ్చు. కాని ద్వాపరయుగానంతరం, కలియుగ ప్రారంభంలో అట్టివారు ఉండి ఉండవచ్చు గదా! అనే సందేహం కలుగవచ్చు.

ఏమి జరిగి ఉంటుందో మనం ఊహించవచ్చు. కలియుగ ప్రారంభంలో ఆపద్ధర్మంగా ఈ నియోగవిధిని అనుసరించి ఉండవచ్చు, అయితే కాలక్రమంలో ఈ నియోగవిధిలోని నియమ నిబంధనలకు క్రమంగా నీళ్ళొదిలి ఉండవచ్చు. అంటే ఒకసారి పెద్దలచే నియోగించబడిన పురుషునితో కలిసిన స్త్రీ - ఆ తరువాయి ఇంకా సంతానం కలుగలేదనే నెపంతో ఆ సంబంధాన్ని కొనసాగించి ఉండవచ్చు. ఆ తర్వాత స్త్రీలు పెద్దల అనుమతితో సంబంధం లేకుండానే ఈ సంబంధాలను కొనసాగించి ఉండవచ్చు.

క్రమంగా స్త్రీ పురుషులు కామవశులై వ్యవహరించి ఉండవచ్చు. సంయోగానంతరం కామదృష్టిని విడనాడలేక పోవచ్చు. అందువల్ల ఈ నియోగవిధిలోని పవిత్రత మంటగలిసి క్రమంగా వ్యభిచారంగా మారి ఉండవచ్చు. అలాంటి పరిస్థితులలో ఆనాటి పెద్దలు ఈ విధానాన్ని నిషేధించి వారసత్వం కొరకు తప్పని పరిస్థితులలో 'దత్తస్వీకారం' అనే పద్ధతిని అమలులోకి తెచ్చి ఉండవచ్చు. అందువల్ల ఈ కాలంలో ఈ నియోగవిధి ఆచరణలో లేదు.

ఇంతవరకు చర్చించిన విషయాన్ని ఒక్కసారి సింహావలోకనం చేసుకొని ధర్మాధర్మ పరిశీలనతో విశ్లేషణ చేద్దాం. అపోహలను, అపార్థాలను తొలగించుకుందాం.

ఈ నియోగవిధి ధర్మసమ్మతమైనదే కాకపోతే, పురాతన కాలం నుండీ ఆచరణలో లేనిదే ఐతే, శాస్త్రాలలో చెప్పబడినదే కాకపోతే, మహాత్ములచేత చెప్పబడినదే కాకపోతే, సత్యవతి తన వంశానికి కళంకాన్ని తెచ్చే ఇలాంటి ఆలోచన చేస్తుందా? తండ్రి యొక్క మనోరథాన్ని నెరవేర్చుటకై రాజ్యాధికారాన్ని వదులుకోవటమే గాక, ఆజన్మబ్రహ్మచర్య వ్రతదీక్షా సంపన్నుడై, కఠోరమైన ప్రతిజ్ఞాపాలనకు కట్టుబడిన మహాత్యాగి భీష్ముడు దీనికి అంగీకరిస్తాడా? అఖండ తపశ్శక్తి సంపన్నుడు, పరమ వైరాగ్యమూర్తి, జ్ఞానస్వరూపుడు, వేదవిభాగంచేసి, బ్రహ్మసూత్రాలను రచించిన ప్రజ్ఞాశాలి వేదవ్యాసుడు తల్లి కోరికను ఎట్టి అరమరికలు లేకుండా అంగీకరిస్తాడా? అంతేకాదు ఇది అధర్మము, అపవిత్రము, శాస్త్రవిరుద్ధము, అసహ్యాకరము అయినదే అయితే తానే స్వయంగా పాత్రధారియైన ఈ గాథను తన మహాభారతగ్రంథంలో ఏ సంకోచం లేకుండా వ్రాసుకుంటాడా? అలా వ్రాసుకున్నాడంటే ఆనాటి సమాజం దృష్టిలో ఇది ఏ దోషమూలేని, ఎవరూ తప్పుబట్టని చర్యయే అయి ఉండాలి. ఇందులో వేదవ్యాసుడు సిగ్గుపడవలసిన అసరం ఏమీ లేదని మనం గ్రహించాలి. ఒక కాలంలో ఆచరణలో ఉన్న పద్ధతులు సరియైనవోకావో, ఆ కాలంలోని చట్టాలను బట్టి, ఆచారవ్యవహారాలను బట్టి, ఆనాటి సమాజంలోని మానవుల దృష్టిని బట్టి నిర్ణాయించాలే గాని మరొక కాలంనాటి చట్టాలను బట్టి, ఆచారవ్యవహారాలను బట్టి, మానవుల దృష్టినిబట్టి నిర్ణయించరాదు. ఒకప్పుడు వితంతు వివాహాలను తప్పుబట్టేవారు, కానీ ఈనాడు సర్వసాధారణం. పైగా ప్రోత్సహిస్తున్నారు కూడా. మహాభారత కాలంనాటి మానవులు-వారు రాజును గాని, అధికారులు గాని, స్వేచ్ఛ కలిగిక పౌరులు గాని, నగరవాసులు గాని, జానపదులు గాని ఎవ్వరూ-ఎప్పుడూ వీరజన్మల గురించి చులకనగా మాట్లాడలేదు; అసలా ప్రసక్తే లేదు; అంబిక, అంబాలికలను విమర్శించలేదు; భీష్ముని దూషించలేదు; పైగా కురువంశ గౌరవప్రతిష్ఠలను నిలిపినవాడుగా, కురువంవ రక్షకుడుగా ప్రశంసించారు, కనుక ఈ నియోగవిధిలో ఏ అధర్మమూ లేదు, అపవిత్రతా లేదు, అసమ్యము లేదు-అని స్పష్టమౌతున్నది.

**ఈ గాథ ద్వారా తెలుసుకోవలసిన కొన్ని ముఖ్య విషయాలు**

**1.** నియోగవిధిన తన కోడండ్రయందు సంతానాన్ని ప్రసాదించమని తన ప్రథమ పుత్రుడు వ్యాసుని కోరింది సత్యవతి. వ్యాసుడందుకు అంగీకరించి వారిద్దరిచేత ఒక సంవత్సరం వ్రతం చేయించమని చెప్పాడు.

సత్యవతి ఆ మాట విని వెంటనే "నాయనా! శీఘ్రమే గర్భధారణ జరిగేటట్లు చూడు" అన్నదే గాని ఆ వ్రతం ఏమిటని అడగలేదు, ఎందుకో అడగలేదు. ఒకవేళ శీఘ్రమే గర్భధారణ జరిగినా 10 నెలల పాటు పుత్ర సంతానం కొరకు వేచి ఉండాలి గదా! మరొక సంవత్సరం ఆగినంత మాత్రాన కొంపలు మునిగిపోతాయా? కాని అలా తొందరపడ్డందుకు ఎలాంటి ఫలితం కలిగిందో చూడండి. పుట్టంధుడు జన్మించాడు.

అసలు వ్రతం దేనికి చెప్పాడు వ్యాసుడు; సమాధానం ఆయన మాటల్లోనే ఉన్నది. వ్రతం చేయకుండా ఏ స్త్రీ కూడా నా సమీపానికి రాలేదు-అన్నాడు వ్యాసుడు. అంటే దీనిలోని ఆంతర్యం ఏమంటే - అంత:పురాల్లో రాణివాసంలో పెరిగిన మహారాణులు విలాసవంతమైన జీవితాన్ని గడుపుతారు. అలాంటి వారు పరపురుషునితో అందునా కపిలజడలతో, దుర్బల శరీరంతో, నల్లదేహచ్ఛాయతో, మిణుగురులు లాంటి కన్నులతో అందవిహీనంగా ఉండే తపశ్శక్తి సంపన్నుడైన తనతో సమాగమానికి వారిని సిద్ధంచేసేందుకే వ్రతం. ఆహార విహారాలలో కొన్ని కఠిన నియమాలను వారిచేత పాటింపజేస్తే వారిలో సహనశక్తి కలుగుతుంది. తన రూపాన్ని భరించ గలుగుతారు. సమాగమం దోషరహితమవుతుంది-అని వ్యాసుని ఉద్దేశం. కాని సత్యవతి తొందరపడింది. ఇలా తొందర పడటంలో ఏ ప్రయోజనమూ లేకపోగా గొప్పనష్టం మాత్రం జరిగింది. దీనినిబట్టి మనం గ్రహించవలసిన నీతి ఏమిటి?

అవతలివారు ఏం చెబుతున్నారో, ఎందుకు చెబుతున్నారో ప్రశాంతంగా వినాలి. వారిని పూర్తిగా చెప్పనివ్వాలి. ఆ తర్వాత మంచిచెడులను గూర్చి ఆలోచించు కోవాలి. అనాలోచితంగా త్వరపడి నిర్ణయాలు తీసుకోరాదు.

**2.** అంబికను సిద్ధం చేస్తూ సత్యవతి ఆమెతో ఏమన్నది? "కురువంశాభివృద్ధికి భీష్ముడు తన అంగీకారాన్ని తెలిపాడు. భీష్ముడు చెప్పినదానికి అనుగుణంగా నడుచుకో" అని శయ్యా మందిరంలో కూర్చోబెట్టి నీకొకదేవరుడున్నాడు, అతడే నీకీ రోజు గర్భాదానం చేస్తాడు" అని చెప్పింది.

ఇక్కడ సత్యవతి అన్నీ పొడిపొడి మాటలే చెప్పింది. ఏ విషయము సంపూర్ణంగా, సమగ్రంగా చెప్పలేదు. కోడలికి పూర్తిగా అర్థమయ్యేటట్లు చెప్పనేలేదు. దీనివల్ల ఎంతో అనర్థం జరిగిపోయింది. ఏమిటది?

కురువంశాభివృద్ధికి భీష్ముడు తన అంగీకారాన్ని తెలిపాడు అన్నది. అంటే ఏమని అర్థం చేసుకుంటుంది అంబిక? భీష్ముడే తనకు సంతానాన్ని ప్రసాదించటానికి అంగీకరించాడని అనుకొని ఉంటుంది. భీష్ముడు ఆజన్మ బ్రహ్మ చర్యవ్రతసంపన్నుడు కదా అనే సందేహం అంబికకు రావచ్చు. కాని కురువంశాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని అంగీకరించి ఉంటాడని సమర్థించుకొని ఉంటుంది. పైగా శయ్యా మందిరంలో కూర్చోబెట్టి నీకొకదేవరుడున్నాడు, అతడే ఈ రోజు నీకు గర్భాదానం చేయటానికి వస్తాడు అన్నది సత్యవతి. దేవరుడంటే భర్తయొక్క సోదరుడు. తనకు తెలిసి భర్త యొక్క సోదరుడు భీష్ముడే. కనుక భీష్ముడే తనకు గర్భాదానం చేయబోతున్నాడని అంబిక ఊహించటానికి అన్ని అవకాశాలు ఉన్నాయి. "వ్యాసుడు నా పుత్రుడే, అతడు నీకు దేవరుడౌతాడు, అతని వల్లనే నీవు సంతానవతివి కావాలి" అని స్పష్టంగా చెప్పి ఉంటే ఈ అనర్థం జరిగేది కాదు గదా! అలా స్పష్టంగా చెప్పలేదు సత్యవతి ఎందుకని? తాను కన్యగా ఉన్నప్పుడు జరిగిన విషయాన్ని చెప్పటానికి సంకోచించిందా? భీష్మునితో చెప్పటానికి సంకోచించని సత్యవతి కోడలితో చెప్పటానికి సంకోచం ఎందుకు? భీష్ముడే తప్పుపట్టనప్పుడు కోడలెందు తప్పుపడుతుంది? కొందరు ఎంత తెలివిగల వారైనా అనుకోకుండానే పప్పులో కాలువేస్తుంటారు. ఇపుడు సత్యవతి వ్యవహారం అంతా అలాగే ఉన్నది. సత్యవతి ఇలా విషయాన్ని దాచి, వివరంగా చెప్పక, పొడిపొడిగా మాట్లాడినందువల్లే అంబిక తనకు దేవురుడు భీష్ముడు గదా! ఆయన కురువంశ అభివృద్ధికి అంగీకరించాడు అని చెప్పటం వల్ల తన ప్రతిజ్ఞను వదులుకొని ఉండవచ్చు అని భావించింది. అందుకే శయ్యాపూ కూర్చొని అంబిక, "సోచంతయత్ తదా భీష్మం అన్యాంశ్చ కురుపుంగవాన్" భీష్ముని, ఇతర కురువంశీయులను తలచుకుంటూ ఉన్నది. వ్యాసుని విషయం చెప్పకుండా ఇలా సంశయంలో పడవేసినందున భీష్ముని, కురువంశీయులను తలచుకుంటున్న అంబిక వ్యాసుని చూడగానే భయంతో కన్నులు మూసుకుంది. తత్ఫలితంగా అంధునికి జన్మనిచ్చింది. ఇదంతా సత్యవతి యొక్క పొరపాటు వల్లనే అని చెప్పక తప్పదు.

దీనినిబట్టి మనం గ్రహించవలసిన నీతి ఏమి?

**మన మనస్సులోని భావాలను ఇతరులకు స్పష్టంగా అర్థమయ్యేటట్లు చెప్పాలి. చెప్పవలసిన విషయాలను దాచిపెట్టి గాని, పొడిపొడిగా అర్థమయ్యి కానట్లుగా గాని మాట్లాడితే అపార్థాలు, అనర్థాలు జరుగవచ్చు.**

**3.** ఇద్దరు కోడండ్రకు ఇద్దరు పుత్రులు పుట్టారు. మరి మరొకపుత్రుని తన పెద్దకోడలికి ప్రసాదించమని వ్యాసుని కోరింది సత్యవతి-ఎందుకు?

తన రెండవ కోడలు అంబాలిక పుత్రుడు అందంగా ఉన్నాడు. కాని అంబికకు పుట్టింది గ్రుడ్డివాడు. తన సోదరి పుత్రునితో తన పుత్రుని పోల్చుకుని ఆమె భవిష్యత్తులో బాధపడ వచ్చు. కనుక అంబికకు కూడా ఏ దోషమూ లేని పుత్రుడుంటే బాగుండుననుకున్నది. ఉద్దేశం మంచిదే, అయితే తన ఉ ద్దేశాన్ని అంబికకు చెప్పి అంగీకరింపజేసిందా? లేదు. పోనీ తన కోడలే తనకు అందమైన పుత్రుడు కావాలని కోరిందా? లేదు. పోనీ కోడలికి సలహా ఇస్తున్నట్లుగా, ఇలా చేస్తే ఏనాటికైనా నీఉ బాధపడకుండా ఉంటావని తెలియజేసిందా? లేదు. ఆమే మనస్సులో అనుకున్నది. కోడలి ఇష్టాఇష్టాలు తెలుసుకోకుండానే ఆదేశించింది. ఇలా ఆదేశించటం వల్ల జరిగిందేమిటి?

అంబాలిక తన దాసిని శయ్యాగృహానికి పంపించింది. దీనినిబట్టి వ్యాసుని చెంతకు వెళ్ళటానికి అంబికకు ఇష్టం లేదని తెలిపోయింది. సత్యవతి కోడలిపై పెత్తనం చేసే అత్తగారిలా వ్యవహరించిందేమోననిపిస్తున్నది. కోడలి ఇష్టా ఇష్టాలను తెలుసుకోకపోవటం సత్యవతి తప్పు. దీనిని బట్టి మనం గ్రహించవలసిన నీతి ఏమి?

**అత్తలు కోడళ్ళతో ఎలా వ్యవహరిస్తారో దానికి తగ్గట్టు**

**గానే కోడళ్ళు అత్తలపట్ల వ్యవహరిస్తారు. కనుక అత్తా కోడళ్ళు తల్లీకూతుళ్ళ లాగా అరమరికలు లేకుండా వ్యవహరించాలి.**

**4.** అంబికకు బిడ్డపుట్టిన తర్వాత గదా అంబాలికకు గర్భాదానం జరిగింది. మరి సంవత్సరం వ్రతానికి అంగీకరించని సత్యవతి ఈ 10 మాసాల వ్యవధికి ఎలా అంగీకరించింది? ఆ సంవత్సర వ్రతాన్ని చేయించకపోవటం వల్ల గదా అంధుడు జన్మించింది. మరి అంబాలిక చేతనైనా ఆ వ్రతాన్ని చేయించవచ్చు గదా! ఆ ప్రసక్తే లేదు. పోనీ అంబాలికకు పాండురాజు పుట్టాడు. అతడు రాజార్హుడు కనుక సమస్య తీరిపోయింది. అంబికకు అందమైన పుత్రుడు కావాలని అభిలషించిన సత్యవతి అంబికచేతనైనా ఆ సంవత్సర వ్రతం చేయించిందా? లేదు. ఇదంతా సత్యవతి యొక్క అనాలోచిత అస్తవ్యస్తమనోస్థితి. సత్యవతి ఇన్ని అనాలోచితమైన పనులెందుకు చేసింది? బహుశా వసురాజు వీర్యం వల్ల జన్మించినా? పెరిగింది దాశరాజు ఇంటగనుక. అంటే ఎంత గొప్ప వంశంలో జన్మించినా పెరగటం అల్పుల ఇంట గనుక సత్యవతి అనాలోచితంగా, పరిణతి లేకుండా వ్యవహరించింది. కర్ణుడు కూడా సూర్యభగవానుని వల్ల కుంతికి జన్మించినా, సూతుల ఇంట పెరగటం, సూతుల సంస్కారాలవల్ల నోటికి వచ్చినట్లు ప్రేలే వాచాలత్వం, దుష్టబుద్ధి అబ్బినవి. దీనినిబట్టి గ్రహించవలసిన నీతి ఏమి?

**ఏదైనా ఒక సమస్య వచ్చినప్పుడు కూలంకషంగా ఆలోచించాలి. సమర్థులైనవారితో చర్చించాలి. పూర్వాపరాలు ఆలోచించుకోవాలి. ఎంతో పరిణతితో ఆలోచించాలి. త్వరపడి హడావుడిగా అనాలోచితంగా ప్రవర్తించరాదు.**

**5.** వ్యాసునితో సమాగమం సమయంలో ఆయన రూపాన్ని చూడలేక అంబిక కళ్ళు మూసుకుంది. మాతృదోషం చేత అంధుడు పుట్టాడు. అంబాలిక కళ్ళు తెరుచుకొనే ఉన్నది గాని వెలవెలబోయింది. అందువల్ల పాండువర్ణ దేహుడు పుట్టాడు. అంటే సంభోగసమయంలో స్త్రీ యొక్క మనోభావాలు పుట్టబోయే బిడ్డపై పడ్డాయని తెలుస్తున్నది. దీనిని బట్టి మనం ఏమి గ్రహించాలి.

**నూతన దంపతులు తమ బెడ్‌రూములో మనస్సుకు ఆహ్లాదం కలిగించే దృశ్యాలను, తమకు ఇష్టమైన వస్తువులను ఏర్పాటు చేసుకోవాలి. భార్యాభర్తలిరువురూ ఒకరిపై ఒకరు ఎంతో ప్రేమతో, ఇష్టంతో, అనురాగంతో ఉన్నప్పుడే కలవాలి. అప్పుడే సత్సంతానయోగం.**

**6.** గర్భాదానం రోజునే ఎటువంటి బిడ్డ పుట్టబోతున్నాడో చెప్పగలిగిన త్రికాలజ్ఞాని వేదవ్యాసుడు. ఈనాడు పిండం పెరుగుతున్నప్పుడే స్కానింగ్ చేసి చెప్పగలుగుతున్నారు. ఈ **"యంత్రశక్తి కన్నా అద్భుతమైనది ఆనాటివారి తపశ్శక్తి"** అని తెలుస్తుంది.

**దేవరన్యాయం**: ఇంతవరకు నియోగవిధి అంటే ఏమిటో తెలుసుకున్నాం. పుత్రులు లేకుండా మరణించిన రాజు యొక్క భార్య గురుజనుల నియోగంతో ఒక మహాపురుషుని ద్వారా సంతానాన్ని పొందటం నియోగవిధి. ఒక మహాపురుషుని బదులు ఆ స్త్రీ యొక్క దేవరుని (భర్తయొక్క సోదరుని) ద్వారా సంతానాన్ని పొందటమే దేవరన్యాయం. ఇది కూడా నియోగవిధి లోనిదే. ఎందుకంటే ఆ దేవరుని నిర్ణయించి నియోగించాల్సింది ఆ వంశపెద్దలు, గురుజనులే. ఇక్కడ వ్యాసుడు అంబిక, అంబాలికలను దేవరుడు. ఎందుకంటే అతడు సత్యవతికి కన్యగా ఉన్నప్పుడు పరాశరుని వల్ల జన్మించినవాడే కనుక. అందువల్ల దీనిని దేవరన్యాయం అంటారు. ఇదీ ధృతరాష్ట్ర, పాండు, విదురుల జన్మవిధానం.

అలాగే నియోగవిధిలో కేవలం భర్త మరణించిన స్త్రీయే గాదు, భర్త బ్రతికే ఉన్నా సంతానాన్ని ఇవ్వటానికి అశక్తుడైనప్పుడు, ఆ భర్తయే సతానాపేక్షతో తన భార్యను నియోగించవచ్చు. ఈ విధంగానే పాండురాజు తనకు కలిగిన శాపకారణంగా కుంతీ, మాద్రులను నియోగించి ధర్మదేవ, వాయుదేవ, ఇంద్రదేవ, అశ్వనీదేవతల వల్ల పంచపాండవులను ఐదుగురు పుత్రులపు పొందటం జరిగింది.

ఈ నియోగపద్ధతిలో పుత్రసంతానాన్ని పొందే విషయంలో ఆనాటి స్త్రీలకు వేరు వేరు భావాలుండేవని తెలుస్తున్నది. 1) అంబిక, అంబాలికలకు సంతాన కాంక్ష ఉన్నట్టు మనకు ఏ ఆధారం లేదు. కాని అత్తగారి మాటను నిరాకరించకుండా, పెద్దలమాటను గౌరవించాలనే భావమే వారిలో ఉన్నట్టు తెలుస్తున్నది. 2) ఇక కుంతీదేవి విషయానికొస్తే పాండురాజు కుంతీదేవితో, "పితృ ఋణాన్ని తీర్చుకునేందుకు, మరణానంతరం ఉత్తమలోకాలను పొందేందుకు నీవు మహాపురుషుల ద్వారా సంతానవతివి కావాలి" అని చెప్పగా, కుంతీదేవి అంగకరించలేదు. అయితే పాండురాజు ఒత్తిడి చేయటంతో దూర్వాసుని మంత్రం ద్వారా సంతానాన్ని పొందటానికి అంగీకరించింది. 3) ఇక మాద్రి పాండురాజు వద్దకెళ్ళి స్వయంగా అడిగింది. అయితే ఇది

సవతికి పుత్రులుండి తనకు లేకపోవటాన్ని న్యూనతగా భావించియే. ఇలా ఒక్కొక్కరు ఒక్కోవిధమైన భావాలు కలిగి ఉన్నారు.

ఇక కుంతీదేవి, మాద్రి - వీరిరువురూ పురుష సమాగమం లేకుండా దేవతల ద్వారా యోగశక్తిచేత గర్భం ధరించారు. మహిమగల దేవతల వల్లనే ఇది సాధ్యం గాని, సామాన్య మానవులకీయోగశక్తి ఉండదు. దేవతలు 4 విధాలుగా సంతానాన్ని ప్రసాదించగలరు.

**1. సంకల్పాత్:** మనస్సులో సంతానం కలగాలని కేవలం సంకల్పించటం ద్వారా గర్భధారణం.

**2. వాచా:** "నీకు సంతానం కలుగుతుంది" అని వాక్కు ద్వారా దీవించటం వల్ల గర్భధారణ.

**3. స్పర్శాత్:** సంతానం కలగాలనే భావంతో తలను చేతితో స్పర్శించటం ద్వారా గర్భధారణం.

**4. దృష్ట్యా:** కేవలం ఆ స్త్రీ ముఖంలోకి చూడటం ద్వారా గర్భధారణం జరుగుతుంది.

ఇవి సామాన్య మానవులకు, శాస్త్రజ్ఞానం లేనివారికి, యోగప్రక్రియలు అనుభవంలో లేనివారికి, వీటిని నమ్మనివారికి ఆశ్చర్యం కలిగిస్తాయి. అట్టివారే కొందరు విమర్శలకు పూనుకుంటారు.

ఇక కురుసామ్రాజ్యంపై హక్కు అధికారం ఎవరిది? అనే విషయంలో లోకంలో ఉన్న విమర్శలకు సమాధానాలను, విమర్శకుల ఆలోచనా విధాలను సమగ్రంగా విశ్లేషణ చేద్దాం.

**(వచ్చే సంచిక నుండి)**

A.M.C-1 అనుభవం


# ప్రకృతితో నా సహచర్యం

సాయం సంధ్యా సమయం కావస్తోంది
కృష్ణమ్మతల్లి చల్లగా, హాయిగా పరవళ్ళు త్రొక్కుతోంది
పిల్లగాలులు చల్లగా హాయిగా వీస్తూ,
మనసుకు హాయి కలిగిస్తున్నాయి.

సూర్యభగవానుడు కృష్ణమ్మ తల్లి
చల్లగాలికి కరిగిపోయి మెల్లిగా అస్తమిస్తున్నాడు
అస్తమిస్తున్న సూర్యుని కిరణాలు

ఆకాశమంతా బంగారం పరిచినట్లుంది
అక్కడక్కడా ఉన్న నల్లని మేఘాలు
చల్లని గాలి వీస్తూ, చిరుజల్లు కురుస్తుంది
పూలవర్షం కురుస్తున్నట్లుగా అనిపిస్తుంది.

కృష్ణమ్మతల్లి ఒడిలో పిల్లలందరూ
హాయిగా ఆనందంగా కృష్ణమ్మలా
ఎటువంటి కల్మషం లేకుండా
పరవశంతో ఆడుకుంటున్నారు
పక్షులు కిలకిలారావం చేసుకుంటూ
గూటికి చేరుకుంటున్నాయి.



సంధ్యా సమయంలో ప్రకృతిని ఇలా చూస్తుంటే
నాకూ కృష్ణమ్మ తల్లి ఒడిలో తనివితీరా
ఆడుకోవాలనిపిస్తుంది, పాడుకోవాలనిపిస్తుంది
ఇంత అందమైన ప్రకృతిని కల్గిన
మట్టపల్లి వాసుందలరూ జన్మధన్యం చేసుకున్నారు.

డి. పద్మకుమారి, మూలగుంటపాడు